'హంగ్ పార్లమెంట్'పై విశ్రాంత జడ్జీల ఆందోళన

రాజ్యాంగాన్ని పరిరక్షించాలని రాష్ట్రపతికి లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకీ తగిన సంఖ్యాబలం రాకుండా, హంగ్ పార్లమెంట్ పరిస్థితులు ఏర్పడితే, గతంలో అనుసరించిన ప్రజాస్వామిక విధానాలను అమలు చేయాలని ఏడుగురు విశ్రాంత హైకోర్టు జడ్జీలు సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బహిరంగ లేఖ రాశారు. ఎంపీల బేరసారాలకు అవకాశం లేకుండా చూడాలని, ఎన్నికలకు ముందు ఏర్పాటైన అతి పెద్ద కూటమిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, సీఈసీలకు కూడా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజాతీర్పును సాధించలేకపోతే, అధికార మార్పిడి సజావుగా జరగదని ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్‌లు జీఎం అక్బర్ అలీ, అరుణ జగదీశన్, డీ హరిపరంధామన్, పీఆర్ శివ కుమార్, సీటీ సెల్వం, ఎస్ విమల, అంజన ప్రకాష్ ఈ లేఖపై సంతకాలు చేశారు.

ఓటింగ్‌లో భారత్ ప్రపంచ రికార్డు

పోలింగ్‌లో పాల్గొన్న 64.2 కోట్ల మంది భారతీయులు

- 68 వేల పర్యవేక్షక బృందాలు, కోటిన్నర పోలింగ్ సిబ్బంది
- రూ.10 వేల కోట్ల విలువైన మద్యం, నగదు, డ్రగ్స్ స్వాధీనం
- ఓట్ల లెక్కింపునకు ముందే ఆరోపణలకు ఆధారాలు చూపాలి
- మీడియాతో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్

న్యూఢిల్లీ, జూన్ 3: లోక్‌సభ ఎన్నికలలో రికార్డు స్థాయిలో భారతీయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 64.2 కోట్ల మంది ఓటింగ్‌లో పాల్గొనడం ప్రపంచ రికార్డు అని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ వెల్లడించారు. వీరిలో 31.2 కోట్ల మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఢిల్లీలోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యంత భారీ ప్రజాస్వామిక ప్రక్రియగా పేర్కొన్న ఈ ఎన్నికలలో 68 వేల పర్యవేక్షక బృందాలు, ఒకటిన్నర కోట్ల మంది పోలింగ్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. ప్రచార సమయంలో కొందరు బడా నేతలు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించినప్పుడు, పోలింగ్ సందర్భంగా పలు చోట్ల ఫిర్యాదులు వచ్చినప్పుడు ఎన్నికల అధికారులు స్పందించకపోవడంపై సోషల్ మీడియాలో 'లాపతా జెంటిల్మెన్ (అదృశ్యమైన పెద్ద మనుషులు)' పేరిట మీమ్స్ చక్కర్లు కొట్టాయి. దీనిపై రాజీవ్‌కుమార్ స్పందిస్తూ తాము ఎక్కడికీ పోలేదని, నిత్యం అందుబాటులోనే ఉన్నామని చెప్పారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నడూలేని విధంగా నాలుగు లక్షల వాహనాలు, 135 ప్రత్యేక రైళ్లు, 1,692 వైమానిక సర్వీసులను వినియోగించామని వెల్లడించారు. ఈసారి కేవలం 39 ప్రదేశాల్లో మాత్రమే రీపోలింగ్ నిర్వహించామని తెలిపారు. ఈసారి రూ.10వేల కోట్ల విలువైన మద్యం, నగదు, ఉచిత బహుమతులు, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్

వదంతులు వద్దు.. ఆధారాలు చూపండి

ఎన్నికల ప్రక్రియను ఏకపక్షం చేసేందుకు కొందరు నేతలు రిటర్నింగ్ అధికారులు, జిల్లా మేజిస్ట్రేట్‌లను ఒత్తిడికి గురిచేశారంటూ వచ్చిన ఆరోపణలను సీఈసీ రాజీవ్‌కుమార్ తోసిపుచ్చారు. చేతనైతే తమ ఆరోపణలను బలపరిచే ఆధారాలను అందించాలని ఆయన సవాల్ చేశారు. ఓట్ల లెక్కింపు ప్రారంభం కాకముందే.. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసిన వారి పేర్లను ప్రతిపక్ష నేతలు వెల్లడించాలని కోరారు. వదంతులను వ్యాపింపజేసి అందరిపై అనుమానం వచ్చేట్టు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను విదేశీ శక్తులు ప్రభావితం చేయకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని కానీ, దేశంలోపలి నుంచే ఈ ఆరోపణలు వస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పలువురు జిల్లా మేజిస్ట్రేట్‌లకు, కలెక్టర్లకు ఫోన్లుచేసి బెదిరించారంటూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చేసిన ఆరోపణలపై సీఈసీ స్పందించారు. అలా బెదిరింపులతో ప్రభావితమైన జిల్లా మేజిస్ట్రేట్ ఎవరో పేరు చెప్పాలని నిలదీశారు. దేశంలో గత 70 ఏండ్లుగా ఇటువంటి ఆరోపణలు వస్తూనే ఉన్నాయని అన్నారు. ఈ ఆరోపణలకు ఒక్క సాక్షి కూడా లేరని వ్యాఖ్యానించారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

అన్ని ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ముందుగా పోస్టల్ బ్యాలట్లను లెక్కిస్తారని, ఇందులో ఎటువంటి అనుమానం లేదని సీఈసీ స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలట్ల లెక్కింపు ప్రారంభమైన అరగంటకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలోని ఓట్లను లెక్కించడం ప్రారంభిస్తామని తెలిపారు. మెజారిటీ పోలింగ్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలట్లు అతి తక్కువగా ఉన్నాయని, అందువల్ల వాటి లెక్కింపు త్వరగా పూర్తవుతుందని చెప్పారు. చివరగా వీవీ ప్యాట్‌లలో నమోదైన ఫలితాలను ఈవీఎంలలో నమోదైన ఫలితాలతో పోల్చి చూస్తామని వివరించారు. కౌంటింగ్ ప్రక్రియ మూడు దశలుగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పాల్గొన్నారు.

లోక్‌సభ అభ్యర్థుల్లో మహిళలు 10 శాతమే

న్యూఢిల్లీ, జూన్ 3: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు త్వరలో అమలు కానున్న తరుణంలోనూ.. ఎన్నికల రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం ఆశించినంత పెరగడం లేదని తాజా లోక్‌సభ ఎన్నికలు తేటతెల్లం చేశాయి. దేశవ్యాప్తంగా బరిలో ఉన్న మొత్తం అభ్యర్థుల్లో 9.6 శాతం (797 మంది) మాత్రమే మహిళలని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) వెల్లడించింది. 1957 సార్వత్రిక ఎన్నికల్లో 3 శాతంగా ఉన్న మహిళా అభ్యర్థుల సంఖ్య 10 శాతానికి చేరడానికి దాదాపు 70 ఏండ్లు పట్టింది. తాజా ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున పోటీ చేస్తున్న మహిళల సంఖ్యను పరిశీలిస్తే.. తమిళనాడుకు చెందిన నామ్ తమిళర్ కట్చి తరపున పోటీ చేసినవారిలో 50 శాతం మంది మహిళలే ఉన్నారు. బీజేపీ తరపున 69 మంది(16 శాతం), కాంగ్రెస్ నుంచి 41 మంది(13), జేఎంఎం, ఆర్జేడీ నుంచి 33 శాతం మంది మహిళలు బరిలో నిలిచారు. జాతీయ పార్టీల కంటే ప్రాంతీయ, చిన్న పార్టీలే మహిళలకు ఎక్కువగా టికెట్లు కేటాయించడం గమనార్హం.

సంక్షిప్త వార్తలు

• టికెట్ రద్దుతో రైల్వేకు రూ.6,112 కోట్లు

న్యూఢిల్లీ, జూన్ 3: రైల్వే టికెట్ రద్దు.. రైల్వేశాఖకు వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుతున్నది! 2019 నుంచి 2023 వరకు (నాలుగేండ్లలో) టికెట్ రద్దుపై మొత్తం రూ.6,112 కోట్లు చార్జీల రూపంలో రైల్వే శాఖ వసూలు చేసినట్టు తాజాగా గణాంకాలు వెల్లడించాయి. రాయ్‌పూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త కునాల్ శుక్లా దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తుకు రైల్వే శాఖ ఈ మేరకు సమాధానమిచ్చింది. టికెట్ రద్దు కోరితే.. అందుకుగాను క్లరికల్ చార్జీల కింద కనీస మొత్తాన్ని మాత్రమే వసూలు చేస్తున్నామని, ఇదంతా రైల్వే ఆదాయంగా పరిగణించరాదని బిలాస్‌పూర్ రైల్వే అధికారి వికాస్ కశ్యప్ చెప్పారు.

• చెట్లను నరకొద్దంటూ ఫత్వా

లక్నో: 'చెట్లను నరకొద్దు, పంటలను కాల్చొద్దు' అని ఇస్లామిక్ సెంటర్ ఆఫ్ ఇండియా (ఐసీఐ) ఓ ఫత్వాను జారీ చేసింది. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంపై ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ ఆదేశాలను ఇచ్చింది. పచ్చదనాన్ని కాపాడటం, నీటిని పరిరక్షించడం, వృథాను నివారించడం ముస్లింల కర్తవ్యమని ఖురాన్ చెప్పినట్లు తెలిపింది. ఐసీఐ చైర్‌పర్సన్ మౌలానా ఖాలిద్ రషీద్ ఫారంగి మహలి ఈ మేరకు ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. జీవులకు, ప్రజలకు ఉపయోగపడే మొక్కలను నాటేవారికి దేవుడు మేలు చేస్తాడని తెలిపారు. చెరువులు, కాలువలు, నదులు, సముద్రాలను కలుషితం కాకుండా పరిరక్షించాలని కోరారు.

• భారత్‌లో 71 లక్షల ఖాతాలపై వాట్సాప్ బ్యాన్

న్యూఢిల్లీ, జూన్ 3: నిబంధనలు ఉల్లంఘించారంటూ 71 లక్షల మంది భారతీయ యూజర్లపై ఈ ఏడాది ఏప్రిల్‌లో వాట్సాప్ నిషేధం విధించింది. ఖాతా దుర్వినియోగం అరికట్టడానికి, వాట్సాప్ సమగ్రతను కాపాడేందుకు నిషేధం విధించినట్టు సంస్థ తాజాగా విడుదల చేసిన నెలవారీ నివేదికలో పేర్కొన్నది. వాట్సాప్ విధానాలను ఉల్లంఘించే ఖాతాలపై చర్యలు ఇక ముందు కూడా కొనసాగుతాయని, యూజర్‌కు ఈ వేదికపై సురక్షితమైన వాతావరణాన్ని కల్పించటంలో నిరంతర చర్యలు చేపడుతామని వాట్సాప్ తెలిపింది.

• 93 ఏండ్ల వయసులో మర్డోక్ ఐదో పెండ్లి

లాస్ ఏంజెల్స్, జూన్ 3: అంతర్జాతీయ మీడియా మొఘల్‌గా పేరొందిన రూపర్ట్ మర్డోక్.. 93 ఏండ్ల వయసులో మళ్లీ పెండ్లి చేసుకున్నారు. ఆయనకు ఇది ఐదో వివాహం. తన కంటే వయసులో 25 ఏండ్లు చిన్నదైన రిటైర్డ్ మాలిక్యులార్ బయాలజిస్ట్ ఎలీనా జుకోవా(67)ను వివాహమాడారు. లాస్ ఏంజెల్స్‌లోని ఆయన సొంత ఎస్టేట్‌లో గత శనివారం వీరి వివాహం జరిగింది. ఆస్ట్రేలియాకు చెందిన మర్డోక్ కుటుంబం, ద వాల్ స్ట్రీట్ జర్నల్, ఫాక్స్ న్యూస్.. సహా ఆయా దేశాల్లోని ప్రఖ్యాత మీడియా ఔట్‌లెట్స్‌ను నిర్వహిస్తున్నది.

• 20 రోజుల్లో ఎన్డీయేలోకి ఉద్ధవ్: రవి రాణా

ముంబై, జూన్ 3: శివసేన (ఉద్ధవ్ వర్గం) పార్టీపై మహారాష్ట్ర ఎమ్మెల్యే రవి రాణా సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరిన 20 రోజుల్లోగా ఉద్ధవ్ ఎన్డీయేలో చేరుతారని చెప్పారు. రవి రాణా భార్య, నటి నవనీత్ కౌర్ అమరావతి ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేశారు. శివసేన నుంచి షిండే, ఎన్సీపీ నుంచి అజిత్ పవార్ బయటకు వెళ్తారని గతంలో తాను కచ్చితంగా అంచనా వేశానని, ఈ సారి కూడా తాను చెప్పున్నది నిజమవుతుందని రవి రాణా పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను చూసి షాక్‌కు గురికాకుండా, మహావికాస్ అఘాడీ నాయకులు బీపీ మందులు దగ్గరపెట్టుకోవాలని సూచించారు.

• మెక్సికో తొలి మహిళా అధ్యక్షురాలిగా క్లాడియా

మెక్సికో సిటీ, జూన్ 3: మెక్సికో అధ్యక్ష ఎన్నికల్లో పర్యావరణ శాస్త్రవేత్త, మెక్సికో సిటీ మాజీ మేయర్ క్లాడియా షీన్‌బామ్ గెలుపు దాదాపు ఖాయమైంది. 200 ఏండ్ల మెక్సికో చరిత్రలో క్లాడియా షీన్‌బామ్.. ఆ దేశానికి తొలి మహిళా అధ్యక్షురాలు కాబోతున్నారు. ఆమెకు 58.3 శాతం నుంచి 60.7 శాతం మధ్య ఓట్లు వచ్చాయని ఆ దేశ నేషనల్ ఎలక్టోరల్ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు వెల్లడించారు. తాను దేశానికి తొలి మహిళా అధ్యక్షురాలిగా కాబోతున్నానని క్లాడియా సంతోషం వ్యక్తం చేశారు.

• రఫాను వీడిన 10 లక్షల మంది నిరాశ్రయులు

న్యూయార్క్, జూన్ 3: ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం పాలస్తీనాలో మారణకాండను సృష్టిస్తున్నది. యుద్ధ పరిస్థితుల కారణంగా రఫా నగరంలో పాలస్తీనియన్ల జీవన పరిస్థితులు మాటల్లో చెప్పలేని విధంగా ఉన్నాయని, దీంతో గాజాలోని రఫా నగరం నుంచి దాదాపు 10 లక్షల మంది బలవంతంగా పారిపోవాల్సి వచ్చిందని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థి ఏజెన్సీ తాజాగా వెల్లడించింది. ఖాన్‌యూనిస్‌లో దెబ్బతిన్న సౌకర్యాలతో వేలాది కుటుంబాలు ఆశ్రయం పొందుతున్నాయని, అనేక సవాళ్లు ఉన్నప్పటికీ ఏజెన్సీ అవసరమైన వాటిని అందిస్తున్నదని తెలిపింది.

• ఇజ్రాయెలీలపై మాల్దీవుల నిషేధం!

జెరూసలెం, జూన్ 3: పాలస్తీనాతో యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్‌పై తమ దేశవాసుల్లో ఆగ్రహం పెరగడంతో మాల్దీవుల ప్రభుత్వం ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశంలో ఇజ్రాయెలీల ప్రవేశంపై నిషేధం విధించనుంది. ఇందుకు అనుగుణంగా చట్టాలను మార్చాలని ఆ దేశ క్యాబినెట్ నిర్ణయించింది. అదే సమయంలో పాలస్తీనాకు అవసరమైన నిధులు సేకరించి ఇవ్వాలని నిశ్చయించింది. మాల్దీవుల నిర్ణయంపై ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ సోమవారం స్పందించింది. విదేశీ, ఇజ్రాయెల్ పాస్‌పోర్టు కలిగిన ఇజ్రాయెల్ పౌరులెవరూ మాల్దీవులకు వెళ్లొద్దని సూచించింది. ఇప్పటికే మాల్దీవుల్లో ఉన్నవారు వెంటనే ఆ దేశాన్ని వీడాలని కోరింది. మరోవైపు మాల్దీవులకు ప్రత్యామ్నాయంగా భారత్‌లోని బీచ్‌లను సందర్శించాలని ఆ దేశ దౌత్య కార్యాలయం తన పౌరులకు సూచించింది.

ప్రజాతీర్పు ఎవరి వైపు?

› మొదటిపేజీ తరువాయి...

చెబుతుండగా.. ఎగ్జిట్ పోల్స్‌ను విపక్ష ఇండియా కూటమి కొట్టిపారేస్తున్నది. అవి క్షేత్రస్థాయి పరిస్థితులకు విరుద్ధంగా ఉన్నాయని, తమ కూటమి తప్పక అధికారం చేపడుతుందని విపక్ష నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ అనేది నిజమైన సందర్భాలతోపాటు, అబద్ధమైన సందర్భాలు కూడా కండ్ల ముందు ఉన్న నేపథ్యంలో మంగళవారం జరిగే ఓట్ల కౌంటింగ్‌లో ఏ కూటమి విజేతగా నిలువనున్నదో తేలిపోనున్నది.

ఏపీ, ఒడిశా తీర్పూ నేడే

ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలు,12 రాష్ట్రాల్లోని 25 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల ఫలితాలు కూడా మంగళవారం వెలువడనున్నాయి. రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ, నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్(బీజేడీ) పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా ఉన్నాయి. ఏపీలో కొన్ని సర్వే సంస్థలు వైసీపీకి అనుకూలంగా, మరికొన్ని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి అనుకూలంగా ఫలితాలు ఇవ్వడంతో అసలైన ఫలితాలపై ఆసక్తి నెలకొన్నది. ఒడిశాలో బీజేడీకి బీజేపీ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉన్నదని సర్వే సంస్థలు వెల్లడించాయి. మరోవైపు మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ పార్టీలు చీలికకు గురైన నేపథ్యంలో ప్రజాతీర్పు ఏ విధంగా ఉండనున్నదనే దానిపైనా ఉత్కంఠ నెలకొన్నది.

ప్రచారాస్త్రాలు ఫలితమిచ్చేనా?

లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం ఉధృతంగా సాగింది. అధికార, విపక్షాలు ఆరోపణలు, ప్రత్యారోపణలతో హోరెత్తించాయి. ఈ సారి ప్రచారం రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దు వంటి అంశాల చుట్టూనే ప్రధానంగా సాగింది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మైనారిటీల ఓటు బ్యాంకు కోసం బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ప్రధాని మోదీతో సహ బీజేపీ నేతలు విమర్శలు చేశారు. ప్రజల ఆస్తులపై విపక్షాలు కన్నేశాయని, వాటిని పంచేస్తారని విస్తృత ప్రచారం చేశారు. మరోవైపు బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని ఇండియా కూటమి పక్షాలు కౌంటర్ ప్రచారం చేశాయి. బీజేపీ విభజన, మత రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించాయి.

కాంగ్రెస్‌కు డూ ఆర్ డై!

2004 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు వరుసగా అధికారం చెలాయించిన కాంగ్రెస్ పార్టీ.. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బొక్కబోర్లా పడింది. గత రెండు ఎన్నికల్లోనూ ఆ పార్టీకి లోక్‌సభలో ప్రతిపక్ష హోదాకు అవసరమైన 10 శాతం సీట్లు కూడా దక్కలేదు. ఈ నేపథ్యంలో తాజా ఎన్నికలు ఆ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఈ ఎన్నికల్లో కూడా అదే పరిస్థితి తలెత్తితే, అది పార్టీ ఉనికికే ప్రమాదకరమని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తున్నది. ఇందులో భాగంగానే బీజేపీని ఓడించేందుకు పలు ప్రతిపక్ష పార్టీలతో కలిసి ఎన్నికల ముందే కూటమి కట్టింది. ఈ ఎన్నికల్లో తమ కూటమి 295 సీట్లు గెలుస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, తదితర నేతలు చెబుతున్నారు.

అమెరికాలో మరో హైదరాబాదీ మిస్సింగ్

- వారం రోజులుగా కనిపించని విద్యార్థిని నితీశా కందుల
- కాలిఫోర్నియా యూనివర్సిటీలో ప్రస్తుతం విద్యాభ్యాసం
- ఆమె ఆచూకీ కోసం స్థానిక పోలీసుల ప్రయత్నాలు

హ్యూస్టన్, జూన్ 3: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో హైదరాబాద్‌కు చెందిన మరో విద్యార్థిని అదృశ్యమయ్యారు. 23 ఏండ్ల నితీ శా కందుల గత నెల 28 నుంచి కనిపించడం లేదని స్థానిక పోలీసులు వెల్లడించారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు. కాలిఫోర్నియా స్టేట్ యూ నివర్సిటీలో నితీశా చదువుతున్నారు. ఆమె చివరిగా లాస్ ఏంజెల్స్‌లో కాలిఫోర్నియా నంబర్ ప్లేట్‌తో ఉన్న టయోటా కారును గత నెల 30న నడుపుతూ కనిపించిందని కొంత మంది చెప్పినట్టు శాన్ బెర్నార్డినో పోలీసులు వెల్లడించారు. నితీశా కందుల ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ఇటీవల తరచుగా మిస్సింగ్ ఘటనలు

అమెరికాలో భారతీయ విద్యార్థుల మిస్సింగ్ ఘటనలు పెరుగుతున్నాయి. గత నెల 26 ఏండ్ల రూపేశ్ చంద్ర అనే విద్యార్థి షికాగోలో ఆచూకీ లేకుండా పోయాడు. మార్చిలో హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ అర్ఫాత్ అనే విద్యార్థి ఏప్రిల్‌లో క్లీవ్‌ల్యాండ్‌లో హత్యకు గురైనట్టు పోలీసులు గుర్తించారు. భారత్ నుంచి వెళ్లిన క్లాసికల్ డ్యాన్సర్ అమర్నాథ్ ఘోష్‌ను దుండగులు కాల్పులు జరిపి హత్య చేశారు. ఫిబ్రవరిలో 23 ఏండ్ల సమీర్ కామత్ అనే పుర్డ్యూ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి ఇండియానాలోని ఓ అటవీ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో శవంగా కనిపించాడు.



స్మార్ట్‌ఫోన్‌ను వారానికోసారి

రీస్టార్ట్ చేయాలి

అమెరికా జాతీయ భద్రతా సంస్థ సూచన

న్యూఢిల్లీ, జూన్ 3: మీరు ఆండ్రాయిడ్ ఫోన్‌ను గానీ యాపిల్ ఐఫోన్‌ను గానీ వాడుతున్నారా? అయితే మీ ఫోన్లను భద్రంగా ఉంచుకోవాలంటే ప్రతి వారం రోజులకోసారి వాటిని తప్పనిసరిగా రీస్టార్ట్ చేయాలని అమెరికా జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) సూచించింది. సైబర్ నేరగాళ్ల నుంచి స్మార్ట్‌ఫోన్లను సురక్షితంగా ఉంచుకునేందుకు పాటించాల్సిన పద్ధతులను వివరిస్తూ కొన్నేండ్ల క్రితం ఎన్ఎస్ఏ రూపొందించిన ఓ డాక్యుమెంట్ ఇటీవల బయట పడింది. సైబర్ దాడులతోపాటు మాల్‌వేర్ బారిన పడకుండా ఉండాలంటే వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్లను వారానికోసారి రీస్టార్ట్ చేసుకోవాలని ఆ డాక్యుమెంట్‌లో ఎన్ఎస్ఏ సూచించినట్టు 'ఫోర్బ్స్' పత్రిక వెల్లడించింది. 2010 తొలినాళ్లలో తయారైన ఫోన్లను, ముఖ్యంగా హోం బటన్ కలిగిన ఐఫోన్లతోపాటు కొన్ని శాంసంగ్ గెలాక్సీ డివైజ్‌ల గురించి ప్రస్తావిస్తూ ఎన్ఎస్ఏ ఈ సూచన చేసినట్టు తెలిపింది. ఇది ఇప్పటికీ విలువైన సూచనేనని, స్మార్ట్‌ఫోన్లను రీస్టార్ట్ చేయడం ద్వారా కనీసం కొన్ని సైబర్ దాడులనైనా నిరోధించవచ్చని ఆ పత్రిక పేర్కొన్నది.

చెరుకు రసం ఎక్కువగా తాగొద్దు!

పండ్ల జ్యూస్‌లు, సాఫ్ట్‌డ్రింకులు మానుకోండి

- అధిక చక్కెర స్థాయిలతో అనారోగ్య సమస్యలు
- నీరు, మజ్జిగ, పండ్లు వంటివి తీసుకోవాలి
- భారత వైద్య పరిశోధనా మండలి సూచనలు

న్యూఢిల్లీ: వేసవిలో ఎండ వేడిమిని తట్టుకోలేక ఉపశమనం కోసం చాలా మంది చెరకు రసం, పండ్ల జ్యూస్‌లు, సాఫ్ట్ డ్రింక్‌లు తాగుతుంటారు. అయితే చక్కెర స్థాయి అధికంగా ఉండే డ్రింక్‌లకు వ్యతిరేకంగా భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) తాజాగా మార్గదర్శకాల్లో పలు సూచనలు చేసింది. చెరకు రసంలో చక్కెర ఎక్కువగా ఉంటుందని, దాన్ని తాగడాన్ని తగ్గించుకోవాలని పేర్కొన్నది. నీరు లేదా తాజా పండ్లకు సాఫ్ట్ డ్రింక్‌లు ప్రత్యామ్నాయం కాదని, వాటిని తీసుకోవడం మానేయాలని పేర్కొన్నది. వాటికి బదులుగా మజ్జిగ, నిమ్మ రసం నీరు, కొబ్బరి నీళ్లు, చక్కెర లేకుండా పండ్ల జ్యూస్‌లు తాగాలని సూచించింది.

డీహైడ్రేషన్, డయాబెటిస్ రిస్క్

అధికంగా చెరకు రసం తాగడం వల్ల పలు అనారోగ్య ముప్పులు ఉంటాయని డీహెచ్ఈఈ డైటీషియన్ డాక్టర్ శుభా రమేశ్ పేర్కొన్నారు. అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ సమస్య ఎదురవుతుందని, చెమట రూపంలో శరీరం నుంచి నీరు అధికంగా బయటకు వెళ్లే వేసవిలో ఇది ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయని, తద్వారా ఇన్సులిన్ నిరోధకత, టైప్-2 డయాబెటిస్ ముప్పు ఏర్పడుతుంది. అదేవిధంగా అధిక కెలోరీల వల్ల బరువు పెరిగే అవకాశం ఉన్నదని, ఇది డయాబెటిస్, హృదయ సంబంధిత వ్యాధులకు దారితీసే ప్రమాదం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు.

'100% ఫ్రూట్ జ్యూస్' అని చెప్పుకోవద్దు

ఆహార ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపార ప్రకటనలు, లేబుల్స్‌పై నుంచి '100 శాతం ఫ్రూట్ జ్యూస్' అనే పదాలను తక్షణమే తొలగించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు ఆదేశాలు జారీ చేసింది. నీరు కలిపిన పండ్ల రసాలను నూటికి నూరు శాతం పండ్ల రసాలుగా చెప్పుకుంటూ ప్రకటనలు జారీ చేస్తున్నట్లు, లేబుల్స్‌పై రాస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. అమ్ముతున్న జ్యూస్‌లో అత్యధిక భాగం నీరైనపుడు, అది 100% ఫ్రూట్ జ్యూస్ అని చెప్పడం తప్పుదోవ పట్టించడమేనని తెలిపింది.

డ్యాన్స్ చేస్తుండగా గుండెపోటు

ప్రదర్శనలో లీనమయ్యాడనుకుని ప్రేక్షకుల చప్పట్లు

ఇండోర్, జూన్ 3: నృత్య ప్రదర్శన చేస్తుండగా ఓ వ్యక్తి గుండెపోటుకు గురై చనిపోయారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో చోటుచేసుకున్నది. గుమస్తానగర్ ప్రాంతంలో బల్బీర్‌సింగ్ ఛబ్రా (73) హాస్య ప్రదర్శన, బరువు తగ్గించే యోగా తరగతులను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం ఆర్మీ దుస్తులు ధరించిన ఛబ్రా.. ఓ గేయానికి జాతీయ పతాకం పట్టుకొని ప్రదర్శన ఇస్తుండగా, కుప్పకూలిపోయారు. ప్రదర్శనలో లీనమై పడిపోయాడని భావించిన ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందించారు. అయితే, ఛబ్రా ఎంతకీ లేకపోవడంతో అక్కడే ఉన్న వారు వచ్చి సీపీఆర్ చేసి ఆయనను హుటాహుటిన సమీప దవాఖానకు తరలించారు. అయితే, మార్గమధ్యంలో ఛబ్రా చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

భార్య గెలుపు కోసం పొర్లుదండాలు

చెన్నై, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరికొద్ది గంటల్లో రాబోతున్నాయి. దీంతో ఎన్నికల బరిలో నిలబడ్డ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. తమిళనాడులోని విరుధ్‌నగర్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీ చేసిన తన భార్య రాధిక గెలుపు కోసం తమిళనటుడు, రాజకీయ నాయకుడు శరత్ కుమార్ సోమవారం ఇక్కడి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీ మళ్లీ అధికారంలోకి రావాలని, రాధిక గెలవాలని విరుధ్‌నగర్‌లోని అమ్మవారి దేవాలయంలో పొర్లుదండాలు చేసి.. మొక్కుకున్నారు.

బ్రహ్మోస్ మాజీ ఇంజినీర్‌కు జీవిత ఖైదు

పాక్‌కు రహస్య సమాచారం చేరవేత కేసు

నాగ్‌పూర్: పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐకు రహస్యాలు చేరవేసిన కేసులో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఇంజినీర్ నిశాంత్ అగర్వాల్‌కు జీవితఖైదు పడింది. ఈ మేరకు అధికారిక రహస్యాల చట్టం కింద నాగ్‌పుర్ జిల్లా కోర్టు.. 14 ఏండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3 వేల ఫైన్ వేసింది. నాగ్‌పూర్‌లోని బ్రహ్మోస్ సంస్థకు చెందిన కేంద్రంలోని టెక్నికల్ రిసెర్చ్ సెక్షన్‌లో నిశాంత్ విధులు నిర్వర్తించేవాడు. ఆ సమయంలో ఐఎస్ఐకు కీలక సమాచారం చేరవేశాడని ఆరోపణలు వచ్చాయి. దీంతో 2018లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన మిలిటరీ ఇంటెలిజెన్స్, ఉగ్రవాద నిరోధక బృందాలు ఆపరేషన్ నిర్వహించి అరెస్టు చేశాయి. పలు సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశాయి. విచారణ అనంతరం తాజాగా నాగ్‌పూర్ కోర్టు అతడికి శిక్ష విధించింది.

ఏఐ విపత్తు.. కొలువులు చిత్తు

› మొదటిపేజీ తరువాయి...

దాదాపు 1.2 కోట్ల మంది ఉద్యోగపరమైన మార్పులు ఎదుర్కోవాల్సి వస్తుందని, వాళ్లంతా కొత్త ఉద్యోగాలను వెతుక్కోవాల్సి ఉంటుందని మెకన్సీ తాజా నివేదిక వెల్లడించింది. కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలో చోటుచేసుకొన్న ఉద్యోగ మార్పుల వేగంతో ఇది జరుగనున్నదని అభిప్రాయపడింది. మెకన్సీ సీనియర్ పార్ట్‌నర్, సంస్థ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ క్వేలిన్ ఎల్లింగ్‌రూడ్ ఈ వివరాలను ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

పలు ఉద్యోగాలకు డిమాండ్ తగ్గుదల

ఆయా రంగాల్లోని చాలా ఉద్యోగ పాత్రల్లో రిపీటెడ్ టాస్క్‌లు, డాటా సేకరణ, డాటా ప్రాసెసింగ్ వంటివి ఉంటాయని ఎల్లింగ్‌రూడ్ పేర్కొన్నారు. ఆటోమేషన్ కోసం ఈ విధులు చాలా ముఖ్యమని, వీటిని ఏఐ సమర్థవంతంగా నిర్వహించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఏఐ రంగ ప్రవేశం నేపథ్యంలో డిమాండ్ తగ్గుతున్న క్రమంలో 2030 నాటికి దాదాపు 1.18 కోట్ల మంది ఉద్యోగులు, కార్మికులు తాము ఉన్న ఉద్యోగాల నుంచి కొత్త ఉద్యోగ మార్గంలోకి మారాల్సి ఉంటుందని ఎల్లింగ్‌రూడ్ సహ రచయితగా ఉన్న మెకన్సీ నివేదిక వెల్లడించింది.

మార్పులకు సిద్ధంగా ఉండాలి

భవిష్యత్తులో కృత్రిమ మేధ, ఆటోమేషన్‌ను విస్తృతంగా అందిపుచ్చుకోవడం వల్ల ప్రస్తుతం ఉన్న అనేక ఉద్యోగాల్లోని 30 శాతం టాస్క్‌లపై ప్రభావం పడుతుందని నివేదిక పేర్కొన్నది. దీని బట్టి ప్రతి ఒక్కరూ కొత్త సాంకేతికతలకు అనుగుణంగా తమ పని విధానాలను మార్చుకోవాల్సి ఉంటుంది. మార్పులకు అనుగుణంగా ఉద్యోగులు క్రియాశీలంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని ఎల్లింగ్‌రూడ్ స్పష్టం చేశారు. జాబ్ మార్కెట్‌లో మార్పులను తెలుసుకోవడం, ఆటోమేషన్‌కు తక్కువ అవకాశం ఉన్న నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు.

ఏఐతో వృద్ధి చెందే రంగాలు

హెల్త్‌కేర్, స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమాటిక్స్).

ఈ రంగాల జాబ్‌లపై ప్రభావం

అడ్మినిస్ట్రేషన్, కస్టమర్ సర్వీస్ అండ్ సేల్స్, ఫుడ్ సర్వీస్, ప్రొడక్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్

దొంగతనానికి వచ్చి.. గుర్రు పెట్టి నిద్రపోయి!

లక్నో, జూన్ 3: డాక్టర్ ఇంట్లో చొరబడిన దొంగ ఏసీ వేసుకొని హాయిగా గుర్రుకొట్టి మరీ నిద్రపోయాడు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. ఈ వింత ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో ఆదివారం చోటుచేసుకున్నది. లక్నోలోని ఇందిరానగర్‌లో ఓ తాళం వేసిన ఇంట్లోకి శనివారం రాత్రి ఓ దొంగ చొరబడ్డాడు. మద్యం మత్తులో ఉన్న అతడు ఏసీ వేసుకొని తలకింద దిండు పెట్టుకొని హాయిగా గుర్రుకొట్టి నిద్రపోయాడు. ఉదయం ఇంటి గేటు తెరిచి ఉండటంతో పొరుగింటివారు ఆ ఇంటి యజమాని డాక్టర్ సునీల్‌పాండేకు ఫోన్ చేశారు. దొంగ ఇంట్లో దూరిన సమయంలో ఆయన వారణాసిలో విధుల్లో ఉన్నారు. పాండే ఫిర్యాదు మేరకు పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా, దొంగ హాయిగా ఫోన్‌చేతిలో పట్టుకొని గాఢనిద్రలో ఉన్నాడు. పోలీసులు అతడిని నిద్రలేపి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీలికండ్లు అందుకే..

కోపెన్‌హాగెన్, జూన్ 3: కొంతమందిలో మాత్రమే 'నీలి కండ్లు' ఉండటం వెనుక జన్యుపరమైన కారణాల్ని యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హాగెన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. నీలికండ్లు ఉన్న వారందరూ ఒకే వ్యక్తి లేదా ఉమ్మడి పూర్వీకుడిని కలిగి ఉండొచ్చని వారు పేర్కొన్నారు. సుమారు 6-10 వేల ఏండ్ల కిందట జన్యుపరివర్తనం జరిగిందని, దాని కారణంగానే మనుషుల్లో నీలి కండ్లు ఏర్పడ్డాయని వివరించారు.

బెంగళూరులో 133 ఏండ్ల రికార్డు వాన

బెంగళూరు, జూన్ 3: ఎడతెరపి లేని వర్షాలతో బెంగళూరు తడిసిముద్దవుతున్నది. ఆదివారం (జూన్ 2) ఒక్కరోజు నగరంలో 111 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని, దీంతో గత 133 ఏండ్ల రికార్డ్ బద్దలైందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సైంటిస్ట్ ఎన్ పువియరాసన్ చెప్పారు. ఒక్క రోజు అత్యధిక వర్షపాతం.. 1891, జూన్ 16న నమోదుకాగా, మళ్లీ ఇన్నేండ్లకు ఆ రికార్డ్ బద్దలైందని ఐఎండీ పేర్కొన్నది. ఈసారి జూన్ 1, 2 తేదీల్లో మొత్తం 140.7 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. భారీ వర్షాల కారణంగా అనేక చెట్లు కూలాయి. పలు ప్రాంతాలు నీటమునిగాయి. ముఖ్యంగా జయనగర్‌లో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొన్నది.